గౌరవనీయ న్యాయమూర్తి శ్రీ రాజా ఇలాంగో

క్రిమినల్ అప్పీల్ సంఖ్య:704/2016

తీర్పు:

1. జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, జమ్మలమగుడు వారు తేదీ.16-03-2015 నాడు సి.సి.నెం.95/2012 లో జారీ చేసిన తీర్పును వ్యతిరేకిస్తూ, ఫిర్యాది ఈ అప్పీలును దాఖలు చేసెను.

2. కేసు యొక్క సంక్షిప్త వాస్తవాలు ఈ క్రింది విధంగా ఉన్నాయిః

ఫిర్యాది మరియు ముద్దాయిలు/ధన్నవాడ గ్రామము, మైలారం మండలమునకు చెందిన వారు.ప్రస్తుత కేసులోని ముద్దాయి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, జమ్మలమడుగు కోర్టులోని సి.సి.నెం:54/2009 లో కూడా ముద్దాయిగా నున్నాడు.ఫిర్యాది ఒక రాజకీయ నాయకురాలు మరియు సమాజ సేవకురాలు.ఆమె గ్రామస్తులకు నీటి సదుపాయమును బోరు బావుల ద్వారా కల్పించుటకు ఎక్కువ మొత్తములో డబ్బును ఖర్చు చేసినది.గ్రామస్తుల కొరకు ఫిర్యాది తేదీ.01-10-2008కి ముందు వేయించిన పైప్ లైన్ ను ముద్దాయిలు పాడు చేసెను.ముద్దాయి యొక్క చట్ట వ్యతిరేక పనుల గూర్చి ఫిర్యాది ప్రశ్నించగా, వారు దుర్భాషలతో ఆమెను తిట్టిరి. దానిని బట్టి ఫిర్యాది తలమంచిపట్నము, పోలీసు స్టేషనులో ఫిర్యాదును దాఖలు చేయగా, అట్టి ఫిర్యాదును ఐపిసిలోని విభాగముల సంఖ్య: 506, 509 మరియు 431 మరియు 34

క్రింద నేరము సంఖ్య:61/2008 గా నమోదు చేసి, జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జమ్మలమడుగు కోర్టులో సి.సి.సంఖ్య.54/2009గా నమోదు చేసిరి. అయితే, ఫిర్యాది మేజిస్ట్రేట్ కోర్టులో హాజరగుటకు జమ్మల మడుగు వచ్చుండగా, ముద్దాయిలు రోడ్డుపై కాపు కాసి, ఆమె వాహనమును సమీపించి వారికి వ్యతిరేకముగా సాక్ష్యము ఇవ్వవద్దని ఆమెను తిట్టి, బెదిరించిరి.మరియు ఆమె వారికి వ్యతిరేకముగా కోర్టులో మాట్లాడితే, ఆమెను చంపేస్తామని బెదిరించిరి.ఆమె డ్రైవరు ముద్దాయిలను ప్రశ్నించగా, అతనిని కూడా ముద్ధాయిలు తిట్టి, బెదిరించిరి.అందువలన, ఫిర్యాది ప్రస్తుత ఫిర్యాదును మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలు చేసెను.ఫిర్యాది యొక్క ప్రమాణ పూర్వక వాంగ్మూలమును రికార్డు చేసిన పిమ్మట, ఐపిసిలోని విభాగముల సంఖ్య:506 మరియు 34 క్రింద కేసులోని నేరము, ముద్దాయికి వ్యతిరేకముగా గుర్తించి, అట్టి కేసును సి.సి.సంఖ్య.95/2012 గా నమోదు చేసిరి.

**3.** కేసు విచారణలో నుండగా పిడబ్ల్యు–1 మరియు 2ను పరీక్షించగా, ఫిర్యాది తరపున ఎటువంటి పత్రములు గుర్తించబడలేదు.ముద్దాయి తరపున ఎటువంటి మౌఖిక మరియు లిఖిత పూర్వక సాక్ష్యాధారములు చూపలేదు.

**4.** మౌఖిక మరియు లిఖిత పూర్వక పత్రములు పరిశీలించిన తరువాత, ఐపిసిలోని విభాగములు సంఖ్య.506 మరియు 34 క్రింద ముద్దాయిలు దోషులు కారని తీర్మానించి, ట్రయల్ కోర్టు వారిని విడుదల చేసెను.అట్టి విషయమై వ్యధ చెందిన ఫిర్యాది ప్రస్తుత అప్పీల్ ను దాఖలు చేసెను.

**5.** పిటిషనర్ తరపు న్యాయవాది మనవి చేస్తూ, ట్రయల్ కోర్టు వారు సాక్ష్యాధారాలను సరియైన దృష్టితో పరిశీలించలేదనియూ, పి.డబ్ల్యు-1 మరియు 2 యొక్క సాక్ష్యములు అనుగుణము గానూ, స్థిరముగా ఉన్నవనియు, దానిలో ఎటువంటి సందేహాత్మక పరిస్థితులు లేవని తెలిపెను.

**6.** రికార్డును బట్టి, ఫిర్యాది మరియు ఆమె డ్రైవరును పి.డబ్ల్యు 1 మరియు 2 గా ట్రయల్ కోర్టులో విచారించినారని తెలియుచున్నది.సాక్ష్యాధారాలను నిశితముగా చూచిన తరువాత ఈ క్రిందికారణముల చేత ట్రయల్ కోర్టు వారు ముద్దాయిలను విడుదల చేసిరి:-

(i) ఫిర్యాది సాక్ష్యము నిచ్చుటకు కోర్టుకు వచ్చునపుడు అట్టి సంఘటన జరిగినదని నిరూపించుటకు ఫిర్యాది ఎటువంటి లిఖిత పూర్వక సాక్ష్యమును చూపలేదు.సంఘటన జరిగిన తేదీన ఆమె ఏ కేసు గూర్చి తెలుపుటకు కోర్టుకు వచ్చుచున్నదో, మొదలగు వివరములను తెలుపలేదు.

(ii) పి.డబ్ల్యూ 1 మరియు 2 అను వారలు, వారిని ముద్ధాయిలు ఏ నిర్దిష్ట ప్రదేశములో బెదిరించిరోతెలుపలేదు.

(iii) పి.డబ్ల్యూ 2, తాను డ్రైవరుగా పని చేయుచున్నానని తెలియజేసే ఎలాంటి పత్రమును చూపుటలో విఫలమైనాడు.

(iv) పి .డబ్ల్యూ -1, ఆమె చెప్పిన దానికి మద్దతునిచ్చు ఎలాంటి స్వతంత్ర సాక్షిని పరిశీలించుటలోవిఫలమైనది.

**7.** పైన తెలిపిన పరిశీలనలు మాత్రమే కాకుండా, అట్టి సంఘటన గూర్చి ముద్దాయి ఎలాంటి ఫిర్యాదును పోలీసు స్టేషన్ ఆమె కోర్టుకు వచ్చుదారిలో ఉన్నప్పటికీ, దాఖలు చేయలేదని రికార్డు ద్వారా తెలియుచున్నది.

ఇంకా, పి.డబ్ల్యూ–1 మరియు 2, వారిని ముద్దాయిలు బెదిరించిరని సమాచార మిచ్చుట తప్ప, ముద్ధాయిలు వారిని బెదిరించినారని ఆరోపించిన నిర్ధిష్టమైన మాటలు తెలుపలేదు.ఐపిసిలోని విభాగములు నెం:506 మరియు 34 క్రింద చెప్పబడే నేరము విషయములో, ఆరోపించబడిన ముద్దాయిలు వాడిన పదములు కోర్టులో తప్పక చెప్పవలెను.అప్పుడు అట్టి దూషణలు లేక బెదిరింపు మాటలు ఐపిసిలోని విభాగము 506 క్రింద నేరమగునా? కాదా? అనునది కోర్టులు పరీక్షించెదరు. ముద్దాయిలు ఉపయోగించిన, ఆరోపించబడిన మాటలు నిర్ధిష్టముగా పి.డబ్ల్యూ. 1 మరియు 2 తెలుపలేదు. ఈ పరిస్థితులలో ఈ కోర్టు వారు ట్రయల్ కోర్టు వారు జారీ చేసిన తీర్పులో జోక్యము చేసుకొనుటకు మొగ్గు చూపుట లేదు.

**8.** తదనుసారంగా, క్రిమినల్ అప్పీలు కొట్టివేయబడెను. పర్యవసానముగా, వివిధ పిటిషన్లు ఏమైనా మిగిలి ఉంటే, వాటిని కొట్టివేయబడును.

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _

రాజా ఇలాంగో, న్యాయమూర్తి.

1 ఆగస్టు, 2016